సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 10 । అక్టోబర్ । 2023



శ్రీవారి సేవలో పీవీఎల్

కాళ్ల: తిరుమలలో వేంకటేశ్వరస్వామిని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు దర్శించుకున్నారు. టీటీడీ బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, గాదిరాజు సుబ్బరాజు ఆయన వెంట ఉన్నారు.



పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం: గోకులతిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధానార్చకులు రవికుమార్ ఆచార్యులు పూజలు చేశారు.



గోశాలలో గరుకు స్తంభాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న గో సంరక్షణ శాలలో గోవుల సౌకర్యార్థం నాలుగు గరుకు స్తంభాలను ఏర్పాటుచేశారు. పురోహితులు పూజలు చేశారు.

పేదల బియ్యంపై ప్రత్యేక నిఘా

- అక్రమ రవాణాపై ఉక్కుపాదం
- రెండేళ్లలో 8,399 క్వింటాళ్ల స్వాధీనం
- 224 కేసుల నమోదు
- ప్రత్యేక యాప్‌తో పర్యవేక్షణ



భీమవరంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. పేదల బియ్యాన్ని బొక్కే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటోంది. పటిష్ట నిఘాతో బియ్యం అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించే దశలో చర్యలు చేపట్టింది. రేషన్ షాపుల ద్వారా పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని దారి మళ్లించి వాటికి మరింత పాలిష్ పట్టి మార్కెట్‌లో ఎక్కువ ధరలకు విక్రయించేందుకు అడ్డదారులు తొక్కుతున్న వారిపై 6 ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు కూడా నమోదు చేస్తోంది. అలాగే దీర్ఘకాలంగా బియ్యాన్ని బ్లాక్ మార్కెటింగ్ చేస్తూ తరచూ పట్టుబడిన వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తోంది.

రూ.1.30 కోట్ల విలువైన బియ్యం

పేదలు తినే బియ్యంపై కొందరు అసత్య ప్రచారం చేసి వాటిని తక్కువ ధరకు కొనుగోలు చేసి తిరిగి వాటిని పాలిష్ పట్టి మార్కెట్‌లోకి తెచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గతంలో విచ్చలవిడిగా అక్రమ రవాణా ద్వారా వేలాది టన్నుల బియ్యం సరిహద్దులు దాటేది. టన్నుల కొద్దీ లారీల్లో తరలిపోతున్నా కేసులు నమోదయ్యేవి కావు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పోషకాహారం అందించడంలో భాగంగా నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తోంది. అయినా కొందరు రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్రమార్కుల ఆట సాగనివ్వకుండా ప్రభుత్వం రేషన్ బియ్యం రవాణాపై నిఘాను పటిష్టం చేసింది. అంతర్రాష్ట్ర సరిహద్దులు, మండల నిల్వ పాయింట్లు, చౌక దుకాణాలు, ఎండీయూ వాహనాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడంతో చాలా వరకు అడ్డుకట్ట పడింది. జిల్లాలో గతేడాది 139 కేసులు నమోదు చేసి రూ.92.20 లక్షల విలువైన 5,828 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకోగా ప్రస్తుత సంవత్సరంలో ఇప్పటివరకు 85 కేసులు నమోదు చేసి రూ.38 లక్షల విలువైన 2,571 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాదారులపై సెక్షన్ 6ఏ ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. పట్టుబడిన బియ్యాన్ని వెంటనే పీడీఎస్ మార్కెట్‌లోనికి తీసుకువస్తున్నారు.

రియల్ టైం మానిటరింగ్

ఎప్పటికప్పుడు 6ఏ కేసుల స్థితిగతులను ఆన్‌లైన్‌లో పర్యవేక్షించేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక యాప్‌ను అభివృద్ధి చేసింది. అక్రమ బియ్యం కేసు నమోదు చేసిన వెంటనే సీజ్ చేసిన స్టాక్ వివరాలను ఇందులో అప్‌లోడ్ చేస్తారు. తేదీలు, నెలల వారీగా నమోదైన కేసులు, పరిష్కరించినవి, సీజ్ చేసిన స్టాక్, బయటకు విడుదలైన స్టాక్ వివరాలను రియల్ టైం మానిటరింగ్ చేసేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించారు. రేషన్ బియ్యాన్ని దారి మళ్లించి వాటిని రీసైక్లింగ్ చేసి కస్టమ్ రైస్ కింద చూపించడం, పాలిష్ పట్టి కొత్త ప్యాకింగ్‌తో మార్కెట్‌లో విక్రయించడాన్ని నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది.

కేసులు ఇలా..

సంవత్సరం	సీజ్ చేసిన బియ్యం (క్వింటాళ్లు)	బియ్యం విలువ (రూ.లక్షల్లో)	కేసుల నమోదు
2022–23	5,828	92.20	139
2023–24 (ఇప్పటివరకు)	2,571	38.00	85

చర్యలు తప్పవు

పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు. రెండేళ్లగా 224 కేసులు నమోదు చేసి సుమారు రూ.1.30 కోట్ల విలువైన 8,399 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బియ్యం బ్లాక్ మార్కెట్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కేసులు నమోదు చేస్తున్నాం. పేదలకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేస్తున్నందున వినియోగదారులు వీటిని వినియోగిస్తే మంచి ఫలితం ఉంటుంది.

– ఎస్.సరోజ, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి

న్యూస్‌రీల్

సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



వైద్య సేవలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌ఓ

పాలకోడేరు: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని, దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు అన్నారు. పెన్నాడ అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సర్పంచ్ చిల్లా అనూష మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స అందించడంతో పాటు అవసరమైన వారికి ఆపరేషన్లు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ నూకల మురళి గంగాధరరావు, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, సర్పంచులు చాంబర్ మండల ప్రధాన కార్యదర్శి బొల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బృందం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న బృంద సభ్యులు

భీమవరం అర్బన్: మండలంలోని శ్రీరామపురం, వెంప, తుందుర్రు గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లలో సోమవారం నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్ (హెచ్‌క్యూఏఎస్) ఢిల్లీ బృంద సభ్యులు నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్ చౌదరి నేతృత్వంలో సభ్యులు విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లను పరిశీలించి రోగులకు అందిస్తున్న చికిత్స విధానం, వైద్య పరికరాలు, మందుల నాణ్యత, రోగుల సంఖ్య, వైద్యులు, సిబ్బంది వివరాలు తెలుసుకున్నారు. బృంద సభ్యులు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీస్ డాక్టర్ రమన్ స్వాతి వంశీ, జిల్లా క్వాలిటీ మెడికల్ ఆఫీసర్ తోటే అనిత, తుందుర్రు వైద్యాధికారి కషిత ఉన్నారు.

కొల్లేరులో రెగ్యులేటరీ ఏర్పాటుకు కృషి



కొల్లేరు నేతలతో ఎంపీ కోటగిరి శ్రీధర్

దెందులూరు: కొల్లేరులో త్వరితగతిన రెగ్యులరేటరీ ఏర్పాటుకు, కొల్లేరు ప్రజలకు పూర్తి స్థాయిలో సురక్షిత తాగునీటి సరఫరాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ, సహకారాలతో కృషి చేస్తున్నామని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. సోమవారం ఎంపీ కార్యాలయంలో బీసీ సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు, హస్తకళల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.సూర్యనారాయణ, కొల్లేరు నేత హేమవరప్రసాద్ ఆయన్ను కలిశారు. సురక్షిత తాగునీరు, రెగ్యులేటర్, కొల్లేరు ప్రజల జీవనోపాధి తదితర అంశాలను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీధర్ మాట్లాడుతూ కొల్లేరు సరస్సు కీర్తిప్రతిష్టలు ఇనుమడింప జేసేలా కొల్లేరులో, కొల్లేరు చుట్టూ జీవిస్తున్న రెండు లక్షలకుపైగా ఉన్న ప్రజలకు తొలి ప్రాధాన్యతగా స్వయం ఉపాధి, వృత్తిపరమైన ప్రోత్సాహం, సురక్షిత తాగునీటి సరఫరా లక్ష్యాలుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుందన్నారు. కొల్లేరులో ఆటపాక ప్రాంతాన్ని టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఎంపీ అన్నారు.

అర్జీల పరిష్కారంపై చొరవ అభినందనీయం

ఏలూరు(మెట్రో): ఏలూరు జిల్లాలో జగనన్నకు చెబుదాం–స్పందనలో అందిన అర్జీల పరిష్కారంలో చొరవచూపిన వారిని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రత్యేకంగా అభినందించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలువురు అర్జీదారులకు పరిష్కార పత్రాలను అందజేశారు. ఎస్.చంద్రికమనేశ్వరికి (భీమడోలు మండలం)కి పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు పత్రం, పి.వెంకటేశ్వరరావుకు (చింతలపూడి మండలం) పట్టాదారు పాస్ పుస్తకం అందజేశారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న జాయింట్ కలెక్టర్ లావణ్యవేణిని కలెక్టర్ అభినందించారు. అలాగే బి.నిర్మలకు (కామవరపుకోట మండలం) అడంగల్ పత్రాలు, ఎస్.నీలిమకు (ఉంగుటూరు మండలం) వితంతు పెన్షన్ మంజూరు పత్రాలు అందజేశారు. ముసునూరుకు చెందిన డ్వాక్రా గ్రూపు మహిళలకు రూ.20 లక్షలు, ద్వారకాతిరుమల మండలానికి చెందిన మరో డ్వాక్రా గ్రూపునకు రూ.10 లక్షల బ్యాంకు లింకేజీ రుణ మంజూరు పత్రాలు అందజేశారు. డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వర్లు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, ఆర్డీఓ ఎస్‌ఎస్‌కే ఖాజావలి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జీవీవీ సత్యనారాయణ, జీఎస్ డబ్ల్యూఎస్ నోడల్ ఆఫీసర్ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

గోపోషణ పథకం ప్రారంభం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న క్షేత్రంలో నూతనంగా గోపోషణ పథకాన్ని ప్రారంభించినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒక గోవును పోషించేందుకు నెలకు రూ.5,116 చెల్లించాలని, ఇలా ఎన్ని నెలలైనా అందించవచ్చని పేర్కొన్నారు. పథకం విజయదశమి రోజు నుంచి మొదలవుతుందని, భక్తులు గోపోషణకు ముందుకు రావాలని కోరారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన



పోటీల్లో విజేతలతో అధికారులు

ఏలూరు(మెట్రో): హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించే దిశగా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పర్యవేక్షణలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రోగ్రామ్ అధికారి జి.రత్నకుమారి తెలిపారు. సోమవారం నేషనల్ యూత్ ఫెస్ట్–2023లో భాగంగా హెచ్‌ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేలా రెడ్ రిబ్బన్ క్లబ్ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు 5కే రెడ్ రన్, ఉన్నత పాఠశాల విద్యార్థులకు జిల్లాస్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి బహుమతులు అందజేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నాగేశ్వరరావు, డీఈఓ శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

విజేతలు : 5కే మారథాన్ రెడ్ రన్: బి.మోహన్, పి.సాయిరామ్ (సీఆర్ రెడ్డి కళాశాల), పి.సాయికుమార్ (కోటదిబ్బ కళాశాల) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

- **క్విజ్ పోటీలు:** కె.వైష్ణవి, పి.తనూష (శనివారపుపేట హైస్కూల్), ఎస్.జాన్‌బాబు, జి.క్రిస్పస్ (మాదేపల్లి హైస్కూల్), ఎస్.శ్రీప్రియ, జి.విశేషకృష్ణ (జంగారెడ్డిగూడెం హైస్కూల్) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అలాగే ఎల్.జోయసీరాణి, జి.త్రివేణి (మీర్జాపురం) ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు.



సీఎం జగన్‌తో కలిసి సభాస్థలికి వస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సమరోత్సాహం

విజయవాడలో సోమవారం జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి జిల్లా నేతలు హాజరయ్యారు. శాసనమండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. - సాక్షి, అమరావతి





సీఎం జగన్‌తో ముచ్చటిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, పాలకొల్లు ఇన్‌చార్జి గుడాల గోపీ



కొయ్యలగూడెం : కన్నాపురం శిబిరంలో మందులు అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది



పెదపాడు: ఎస్.కొత్తపల్లిలో మందులు పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ప్రజారోగ్యమే పరమావధి

ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల నిర్వహణ విజయవంతంగా సాగుతోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా రోజూ వేలాది మంది వైద్యసేవలు పొందుతున్నారు. అన్ని ప్రాంతాల్లో ఆరోగ్య క్యాంపులకు విశేష స్పందన వస్తోంది. - సాక్షి నెట్‌వర్క్



భీమడోలు: గుండుగొలనులో వృద్ధురాలికి కళ్లజోడు పెడుతున్న అధికారులు



తాడేపల్లిగూడెం రూరల్: అప్పారావుపేటలో గుండె పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కుక్కునూరు: అమరవరంలో వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

స్పందన అర్జీలకు శాశ్వత పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల అర్జీలను ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలన్నారు. మొత్తంగా 346 అర్జీలు వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో కె.కృష్ణవేణి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, అధికారులు, వయోవృద్ధుల సంక్షేమ అప్పిలేట్ ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- తన మూడో కుమారుడు ఆస్తి కోసం దౌర్జన్యం చేస్తున్నాడని, రక్షణ కల్పించాలని నరసాపురం మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన వింజమూరి శివశంకరరావు అర్జీ అందజేశారు.
- ఇంటి స్థలం కోసం భీమవరం మండలం గొల్లవానితిప్పకి చెందిన గరికపూడి రమణమ్మ అర్జీ అందజేశారు.
- తన పొలం ఆక్రమణకు గురైందని ఇరగవరం మండలం రాపాకకి చెందిన దివ్యాంగుడు పంపన లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు.
- నరసాపురం మండలం రుస్తుంబాద అంబేడ్కర్ నగర్‌లో మురుగునీరు రోడ్డుపైకి వస్తుందని, సమస్య పరిష్కరించాలని వట్టిప్రోలు సతీష్ వినతిపత్రం అందించారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొంటాం

జేసీ రామసుందర్‌రెడ్డి



భీమవరంలో జరిగిన ధాన్యం సేకరణ సదస్సులో మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: సార్వా సీజన్‌లో రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేసేందుకు యంత్రాంగమంతా సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందరరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ధాన్యం సేకరణపై అవగాహన, శిక్షణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 314 రైతు భరోసా కేంద్రాల పరిధిలో 1.96 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా సుమారు 4.65 లక్షల ధాన్యం కొనుగోలును లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈనెల 15న తాడేపల్లిగూడెం రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలును లాంఛనంగా ప్రారంభిస్తామని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పక్కాగా ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకుని అమలు చేయాలని ఆదేశించారు. హమాలీ, వాహనాలు, గోనె సంచుల ఖర్చులను రైతులు భరిస్తే వారి ఖాతాల్లో ఆ మొత్తాన్ని జమచేస్తామన్నారు. కళ్లాల వద్దే ధాన్యం సేకరిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని, సాంకేతిక పరికరాలు, గోనె సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. తాడేపల్లిగూడెం ఆర్డీఓ కె.చెన్నయ్య, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డీఎస్‌ఓ ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, డీసీఓ ఎం.రవికుమార్, ఏఎస్‌ఓ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

మన్యంలో ప్రాజెక్టులు, చెరువులకు జలకళ

- సుమారు 30 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు
- ఖరీఫ్‌లో వివిధ రకాల పంటలు వేసిన రైతులు

బుట్టాయగూడెం: ఈ ఏడాది మన్యంలో వర్షాలు ఓ మాదిరిగా కురిసినా.. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా చేరింది. దీంతో చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. మన్యంలోని సుమారు 128 మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలోని సుమారు 30 వేలకు పైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో రైతులు వివిధ రకాల పంటలు ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, చెరకు పంటలను రైతులు వేశారు. సుమారుగా 18,000 ఎకరాల వరకూ భూముల్లో రైతులు పంటలు వేసినట్లు అధికారులు, రైతులు చెబుతున్నారు. ఈ భూములన్నీ వర్షాధారం మీదే ఆధారపడి ఉన్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు చెరువుల్లోకి నీరు చేరడంతో తమకు సాగునీరు కొరత తీరినట్లే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల బోర్లలో నీరు సమృద్ధిగా లభించనుంది.

పుష్కలంగా ప్రాజెక్టుల్లో నీరు

మన్యప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం కళకళలాడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుత వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరడంతో 216.60 మీటర్లు సామర్థ్యంతో నిండి ఉంది. పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యాన్ని మించి నీరు బయటకు ప్రవహిస్తుంది. కొవ్వాడ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా ప్రస్తుతం 88.75 మీటర్లతో నిండి ఉంది. రబీ పంటలకు జలాశయాల్లో నీరు పుష్కలంగా రైతులు వినియోగించుకొవచ్చని అధికారులు చెబుతున్నారు.



నిండుకుండలా జల్లేరు జలాశయం




కొమ్ముగూడెం చెరువు



జల్లేరు జలాశయం కింద వరి పంటలు వేసిన దృశ్యం

మొత్తం చెరువులు	-	128
100 ఎకరాల పైబడిన చెరువులు	-	40
చిన్న చెరువులు	-	81
చెక్‌డ్యామ్‌లు	-	48
ఆనకట్టలు	-	300
ప్రాజెక్టులు	-	3

చెరువులు, జలాశయాలకు జలకళ



గతంలో ఎన్నడూలేని విధంగా వర్షాలు కురుస్తుండడంతో చెరువుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నాం. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరు అందించేలా కృషి చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌కి నీరు కొరతలేదు. రబీలో సాగునీరు అందించేలా కృషి చేస్తాం.

– టి. సురేష్, మైనర్ ఇరిగేషన్, ఏఈ, కేఆర్‌పురం

క్లుప్తంగా

చిత్రలేఖన పోటీల్లో కొసనాకు ప్రథమ స్థానం



బహుమతి అందుకుంటున్న కొసనా భాస్కరరావు

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన వపా బాపు ఆర్ట్ అకాడమీ అధ్యక్షుడు కొసనా భాస్కరరావు రాష్ట్రస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం వందే వేద భారతం నినాదంతో క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ కాట్రేనికోన ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాస్కరరావు గీసిన నాగశేషుడిపై శ్రీకృష్ణుడి నాట్యం చిత్రలేఖనానికి ప్రథమస్థానం దక్కింది. క్రియేటివ్ ఆర్టిస్ట్ అవార్డును ఎస్.వెంకటేశ్వరరావు, జూనియర్స్ విభాగంలో టి.రాకేష్ ద్వితీయ స్థానం, క్రియేటివ్ ఆర్టిస్టుగా డి.రమ్యలు నిలిచారు. సంస్థ అధ్యక్షుడు అంజి అకొండి చేతులు మీదుగా మెమెంటో, సర్టిఫికెట్‌లను అందుకున్నారు.

పోలీసు స్పందనకు 22 ఫిర్యాదులు



భీమవరం స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: భీమవరం డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యాలయంలో 22 ఫిర్యాదులందాయి. ఎస్పీ యు.రవిప్రకాష్, అడిషనల్ ఎస్పీ ఏవీ సుబ్బరాజు ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించారు. ఫిర్యాదుల్లో ఎక్కువగా వరకట్న వేధింపులు, సరిహద్దుల గొడవలు, సివిల్ వివాదాలకు సంబంధించినవి ఉన్నాయి. అనంతరం ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ స్పందన ఫిర్యాదులను సత్వరమే చట్ట ప్రకారం విచారణ జరిపి త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

భీమవర అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం గూట్లపాడు గ్రామానికి చెందిన ఇలపర్తి ప్రభావతికి భీమవరానికి చెందిన ఇలపర్తి సూర్యనారాయణకు 2022 ఏప్రిల్‌లో వివాహమైంది. అప్పట్లో ప్రభావతి తల్లిదండ్రులు రూ. 6 లక్షలు, ఆడపడుచు లాంచనంగా రూ. 50 వేలు, 5 కాసులు బంగారం ఇచ్చారు. మళ్లీ గత కొంతకాలంగా అదనపు కట్నం తీసుకురమ్మని వేధిస్తున్నాడని భార్య ఇలపర్తి ప్రభావతి ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై బి. మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయంలో చోరీ

సాక్షి, భీమవరం: భీమవరం వన్‌టౌన్ నాచువారి కూడలిలోని గణపతి ఆలయం తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులకొట్టి హుండీని అపహరించి తీసుకువెళ్లారు. నగదును అపహరించి హుండీని సమీపంలో పడేశారని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. గొల్లవానితిప్ప రోడ్డులో ఇద్దరు యువకులు పరస్పరం దాడులు చేసుకున్నారని టూటౌన్ ఏఎస్సై సూర్యనారాయణ తెలిపారు. పరస్పర ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

15 నుంచి కుంకుళ్లమ్మ ఆలయంలో ఉత్సవాలు

రోజుకో అలంకారంలో దర్శనమివ్వనున్న అమ్మవారు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈనెల 15 నుంచి వచ్చేనెల 23 వరకు జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారు రోజుకో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. అందులో భాగంగా ఈనెల 15న శ్రీ బాలా త్రిపుర సుందరీ దేవిగా, 16న శ్రీ గాయత్రి దేవిగా, 17న శ్రీ అన్నపూర్ణా దేవిగా, 18న శ్రీ మహాలక్ష్మిగా, 19న శ్రీ లలిత త్రిపుర సుందరీ దేవిగా, 20న మూలానక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ సరస్వతీ దేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 21న శ్రీ దుర్గాదేవిగా, 22న శ్రీ మహిషాసుర మర్దనిగా అమ్మవారు దర్శనమిస్తారని ఈఓ తెలిపారు. ఉత్సవాల ముగింపు రోజైన 23న శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు భక్తులను కటాక్షిస్తారని, అదేరోజు సాయంత్రం క్షేత్రంలో అమ్మవారి రథోత్సవం, 24న దీక్షాదారుల ఇరుముడి సమర్పణ, చండీహోమాన్ని నేత్రపర్వంగా నిర్వహిస్తామని ఈఓ పేర్కొన్నారు. 25న ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరుపుతామని తెలిపారు. యవన్మంది భక్తులు ఈ వేడుకల్లో పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.





ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ రాజగోపురం, క్షేత్రదేవత శ్రీ కుంకుళ్లమ్మ

డ్రగ్స్ నిరోధంపై అవగాహన కల్పించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): గంజాయి, మాదక ద్రవ్యాలు అక్రమ రవాణాను నిరోధించడంతో పాటు, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జిల్లా స్థాయి నార్కోటిక్స్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం ఎస్పీ యు.రవి ప్రకాష్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డ్రగ్స్ సంబంధిత సమస్యలు పరిష్కరించడంతో పాటు గంజాయి, ఇతర డ్రగ్స్ సాగు, రవాణా, వినియోగం నియంత్రించడంలో సంబంధిత శాఖలు సమన్వయంగా కృషి చేయాలన్నారు. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలలో కార్యక్రమానికి సంబంధించి సదస్సులను నిర్వహించడంతో పాటు, మాదకద్రవ్యాలు ఎలా ఉంటాయో కూడా వారికి చూపించాలన్నారు. జిల్లాలో డ్రగ్ డీఅడిక్షన్ పునరావాస కేంద్రం కావాల్సి ఉందని, ఇందుకు సంబంధించి చర్యలను తీసుకోవాలని అధికారులకు సూచించారు. గంజాయిని అలవాటు చేసుకున్న కొందరు ప్రత్యామ్నాయ మత్తు పదార్థాలైన దగ్గు సిరప్ (కోడైన్), వైట్‌నర్స్, నిద్రమాత్రలు వాడుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సంబంధిత షాపులను గుర్తించి క్రిమినల్ కేసులు నమోదు చేసి సీజ్ చేయాలని డ్రగ్ కంట్రోలర్‌కు ఆదేశాలు జారీ చేశారు. గంజాయి, ఇతర డ్రగ్స్ వినియోగాన్ని, రవాణాను సమర్థవంతంగా నియంత్రించేందుకు నిత్యం తనిఖీలు నిర్వహించడం ద్వారా డ్రగ్స్ అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని ఆర్టీసీ, రైల్వే అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్‌లో షెల్టర్ లెస్ పీపుల్స్ గమనించాలన్నారు. రైల్వే అండర్ పాస్‌లు, గూడ్స్ షెడ్లు తదితర ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. పోలీసులు, పెద్దఎత్తున నిత్యం వాహనాల తనిఖీ నిర్వహిస్తూ గంజాయి అక్రమ రవాణాదారులను గుర్తించడంతోపాటు, గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగదారులకు కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహించాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల నుంచి గంజాయి రవాణాను అరికట్టడంతోపాటు, జిల్లాలో గంజాయి రవాణాను నివారణకు చర్యలు తీసుకున్నామని ఎస్పీ రవి ప్రకాష్ తెలిపారు. గంజాయి స్మగ్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంలో ఉపేక్షించేది లేదని, కచ్చితంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో పోలీసులు నిత్యం వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని, గంజాయి నేరస్థులపై మరిన్ని కేసులు నమోదుచేస్తామని, సాధారణ వినియోగదారులకు కౌన్సెలింగ్ సెషన్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రధాన కళాశాలలు, ప్రధాన కేంద్రాలలో 45 యాంటీ గంజాయి (డ్రగ్) హోర్డింగ్‌లను ప్రదర్శిస్తున్నామని చెప్పారు. ఎస్ఈబీ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏటీవీ రవి కుమార్ మాట్లాడుతూ 2022 – 2023లో గంజాయి నేరస్థులపై 9 కేసులు నమోదుచేసి 27 మందిని అరెస్టు చేశామన్నారు. సమావేశంలో భీమవరం ఆర్డీవో దాసిరాజు, డీఈఓ ఆర్.వెంకటరమణ, డీఐఈఓ వీ.కె.మల్లేశ్వర రావు, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్, జిల్లా ఎక్సైజ్ అధికారి ఎల్.రంగారెడ్డి, జిల్లా ఐసీడీఎస్ అధికారి బి.సుజాత రాణి, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ కెఎస్ఎస్ ప్రసాద్, రైల్వే ఇన్స్‌పెక్టర్ దస్తగిరి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

శ్రీవారి పథకాలకు రూ. 2.51 లక్షల విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి పథకాలకు ఇద్దరు భక్తులు వేరువేరుగా సోమవారం రూ. 2,51,348 విరాళంగా అందజేశారు. అందులో భాగంగా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామానికి చెందిన ఎం.సత్యసాయి శోభన్ బాబు, అరుణకుమారి దంపతులు నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116, అలాగే ఏలూరుకు చెందిన చల్లగళ్ల తిరుపతిరావు నిత్యాన్నదాన పథకానికి రూ. 1,01,116, గోసంరక్షణ పథకానికి మరో రూ.50,116 ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాలను అందించారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరు త్రీటౌన్ పరిధిలో గంజాయి తరలిస్తున్న నిందితుడు వల్లాల మోసారావు అలియాస్ మోజెష్‌ను ఏలూరు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఏలూరు అర్బన్ తహసీల్దార్ సోమశేఖర్ సమక్షంలో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని అతని నుంచి 1.3 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు త్రీటౌన్ సీఐ కోమాకుల శివాజీ తెలిపారు. నిందితుడు గుంటూరు జిల్లా నిదానంపాడుకు చెందిన వ్యక్తి కాగా.. కొంతకాలంగా ఏలూరులోనే తన కుటుంబంతో సహా ఉంటున్నాడు. నిందితుడు మోసారావు మార్చి, ఆగస్టు నెలలో గంజాయి వ్యాపారం చేసినట్లు కేసులు నమోదు కాగా, అతను పోలీసుల నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. అతని కోసం గాలింపు నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అరెస్టు చేసి న్యాయస్థానం ముందు హాజరుపరచగా కోర్టు 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ శివాజీ తెలిపారు. గంజాయి, మత్తుపదార్థాలు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరిమళించిన మానవత్వం



జంగారెడ్డిగూడెంలో డ్రెయిన్‌లో ఇరుక్కుపోయిన ఎద్దును రక్షిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మూగజీవి డ్రెయిన్‌లో ఇరుక్కుపోయి బయటకు రాలేక ఇబ్బందులు పడుతుండగా సమీపంలోని యువత స్పందించింది. మూగజీవిని సురక్షితంగా బయటకు తీశారు. పట్టణంలోని శ్రీనివాస పురం రోడ్ సీఎస్ఆర్ షాపింగ్‌మాల్ ఎదురుగా ఉన్న డ్రెయిన్‌లో సోమవారం ఒక ఎద్దు ప్రమాదవశాత్తు పడిపోయి ఇరుక్కుపోయింది. ఇది గమనించిన స్థానిక యువత ఎద్దును రక్షించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో స్థానిక ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా ఫైర్‌సిబ్బంది వచ్చారు. వారి సాయంతో యువత ఎద్దును సురక్షితంగా బయటకు తీశారు.

కాల్వలో పడి వృద్ధుడి మృతి



మృతదేహాన్ని ఒడ్డుకు తెస్తున్న పంచాయతీ సిబ్బంది

గణపవరం: ప్రమాదవశాత్తూ కాలు జారి కాల్వలో పడి వడ్డి కృష్ణ(68)అనే వృద్ధుడు మరణించాడు. కాశిపాడు గ్రామానికి చెందిన కృష్ణ సోమవారం ఉదయం గ్రామ సమీపంలోఉన్న వెంకయ్య కాల్వలోకి దిగి ప్రమాదవశాత్తూ జారి పడిపోయాడు. ఆ సమయంలో కాల్వలో ప్రవాహం ఎక్కువగా ఉండడంతో కొట్టుకుపోయి మృతి చెందాడు. కృష్ణ కోసం కుటుంబసభ్యులు, పంచాయతీ సిబ్బంది వెదకగా కొంత దూరంలో కాల్వలో కృష్ణ మృతదేహం కనిపించింది. మృతదేహాన్ని పడవ సాయంతో ఒడ్డుకు తీసుకువచ్చారు. కుమారుడు రాంబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గణపవరం ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అనుమానాస్పద మృతి కేసు నమోదు

కామవరపుకోట: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని రావికంపాడు గ్రామ శివారులో సోమవారం జరిగింది. తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం దేవులపల్లి గ్రామానికి చెందిన కాదులూరి మధుసూదన్‌రావు (48) నాలుగు సంవత్సరాల నుంచి రావికంపాడు గ్రామ శివారులో శ్రీ వినాయక న్యూ పంజాబీ ధాబాను అద్దెకు తీసుకుని నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంకాలం దాబా నుంచి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికి రాకపోవడంతో, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు చుట్టుపక్కల వెదికారు. ఆచూకీ తెలియలేదు. సోమవారం ఉదయం దాబా సమీపంలోని పుంతలో మృతుడు మధుసూదన్ రావు పడి ఉండడంతో గ్రామస్తులు గమనించి తడికలపూడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై జయబాబు ఘటన స్థలాన్ని చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

ఉండ్రాజవరం: పుట్టింటికి రావాలని కోరగా కుమార్తె రానని చెప్పడంతో మనస్తాపానికి గురైన ఓ తండ్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఉండ్రాజవరం ఎస్సై కె.రామారావు, స్థానికుల కథనం ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం చింతపల్లికి చెందిన వేములమంద కాశీ విశ్వనాథరాజు (49) కుమార్తె విద్యా కవితకు, మండలంలోని వడ్లూరుకు చెందిన దండు బంగార్రాజుకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంపతులకు ఒక కుమార్తె. కవిత ఏడాదిన్నర నుంచి పుట్టింటికి వెళ్లడం లేదు. తండ్రి రమ్మని పిలిచినా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో కుమార్తెను ఎలాగైనా కలవాలనే ఉద్దేశంతో విశ్వనాథరాజు ఆదివారం వడ్లూరులోని కుమార్తె కవిత ఇంటికి వచ్చాడు. ఆమె తండ్రికి సమాధానం చెప్పకపోవడంతో పాటు పుట్టింటికి రానని తెగేసి చెప్పింది. మనస్తాపం చెందిన విశ్వనాథరాజు తనతో తెచ్చుకున్న పురుగు మందు తాగాడు. అతడిని స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విశ్వనాథరాజు మృతి చెందాడు.

ఎస్ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



ఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సినీ నటి నేహాశెట్టి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని రామచంద్రరావు పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్ఆర్ షాపింగ్ మాల్‌ను సినీ నటి నేహాశెట్టి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏలూరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఆధునిక శ్రేణి వస్త్రాల వినియోగంలో సరికొత్త అనుభూతినిచ్చే విధంగా ఈ షాపింగ్‌మాల్‌లో వస్త్రాలను అందుబాటులో ఉంచారన్నారు. అన్ని వయసుల వారికి ఆధునిక ఫ్యాషన్ డిజైన్లతో కూడిన వస్త్రాలు ఉన్నాయన్నారు. రానున్న పండుగల సీజన్‌కు అన్ని ధరల్లో వస్త్రాలను అందుబాటులో ఉంచారని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ షాపింగ్ మాల్ డైరెక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంతవరకూ తమ సంస్థ 10 శాఖలను నిర్వహిస్తుందని, 11వ శాఖగా ఏలూరులో ఈ మాల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వివిధ ఆఫర్లతో ఆధునిక డిజైన్లతో కూడిన వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో పలువురు స్థానిక ప్రజా ప్రతినిధులు, షాపింగ్ మాల్ ప్రతినిధులు, వినియోగదారులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట 35, 40 డివిజన్లలో గంగానమ్మ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. సోమవారం నగర వీధుల్లో నిర్వహించిన అమ్మవారి ఊరేగింపు సినీ కోయ డాన్స్, గోపాల గోపాల వేషధారణ, భూత, బేతాళ వేషధారణ, కాంతార వేషధారణ, శక్తివేషాలతో కళాకారులు అలరించారు. ఆలయం వద్ద కాళికాదేవి బొమ్మ, పూల డెకరేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా 40వ డివిజన్ కార్పొరేటర్ తుమరాడ స్రవంతి నాగరాజు మాట్లాడుతూ ఇప్పటివరకు గౌరీ పరమేశ్వరుల వేడుకలు నిర్వహించామని, ఈ ఏడాది మొట్టమొదటిగా గంగానమ్మ సంబరాలు 35, 40 డివిజన్ భక్తులందరూ కలిసి నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బుగ్గ నాగరాజు, గౌరవ అధ్యక్షుడు మల్లిమొగ్గల సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు గారపాటి వీరస్వామి, తాబేలు కుమార్, దేవతోటి ప్రసాద్, సేనాపతి రాజు, తిరుమల జగదీష్, కొంపల్లి దుర్గాప్రసాద్, గొంతిన రామకృష్ణ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

స్థల వివాదంపై పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: వేగవరం బజారులో స్థల వివాదం నేపథ్యంలో పరస్పర కేసులు నమోదయ్యాయని హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం వేగవరం బజారు నందు బళ్ళ సూర్యచంద్రం, బోడా రజినిలకు స్థలం విషయమై గొడవ నడుస్తోంది. ఈ నేపథ్యంలో జెట్టి సత్యనారాయణ అనే వ్యక్తి మధ్యలో వచ్చి దాడి చేయడంతో గాయపడి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని సూర్యచంద్రం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా బోడా రజినికి చెందిన ఇంటి స్థలం వివాదం నేపథ్యంలో మూడు నెలల క్రితం సమస్యను సరి చేసి హామీ పత్రాలు రాశానని, ఆ పత్రాలు తన ఇంటి వద్ద ఉండడంతో ఈ నెల 8న బళ్ల సూర్యచంద్రం మరో ఆరుగురితో కలిసి వచ్చి దాడి చేశాడని జెట్టి సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఇద్దరి ఫిర్యాదులపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఉప్పుటేరులో బాలిక మృతదేహం లభ్యం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ గ్రామానికి చెందిన పాలా కావ్య (17) సోమవారం వెస్ట్ కుక్కిలేరు ఉప్పుటేరులో శవమై తేలింది. ఈ నెల 4న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలిక తండ్రి పాలా శ్రీనివాస్ మొగల్తూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరబాబు తెలిపారు.

పరస్పర కేసుల నమోదు

జంగారెడ్డిగూడెం: బంధువుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో పరస్పర కేసులు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. తన బంధువైన కర్రిపోతుల సురేష్ కర్రతో కొట్టి గాయపర్చాడని పంగిడిగూడెం గ్రామానికి చెందిన కాకుళ్ల రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కాకుళ్ల రమేష్ తనపై దాడి చేసి గాయపర్చినట్లు కర్రిపోతుల సురేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్లుప్తంగా

జగనన్న కాలనీ పరిశీలన



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలోని జగనన్న కాలనీ పరిశీలిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ఎల్. అగ్రహారం టిడ్కో సముదాయం ఎదురుగా ఉన్న జగనన్న కాలనీ, 32వ వార్డు ఎస్టీ కాలనీలో నిర్మాణం జరుగుతున్న జగనన్న ఇళ్లను సోమవారం స్పెషల్ చీఫ్ ఇంజనీర్ డీవీ.ప్రసాద్ పరిశీలించారు. ఇంటి నిర్మాణ దశలను తనిఖీ చేశారు. అలాగే లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు అందుతున్నాయా లేదా అని హౌసింగ్ డీడీ కేవీవీఎస్.ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ వీఎన్.వేణుగోపాల్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ధర్మ ఉన్నారు.

ఎస్‌కేఎస్‌డీ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

తణుకు టౌన్: పట్టణంలోని ఎస్‌కేఎస్‌డీ మహిళా అటానమస్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థి సంఘం 2023–24 సంవత్సరానికి సంబంధించిన నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పద్ధతిలో ఎన్నుకున్నట్లు ప్రిన్సిపాల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. సోమవారం జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికలలో మొత్తం నాలుగు ప్యానెల్స్ పోటీ చేయగా మొదటి ప్యానెల్ సభ్యులు విజయం సాధించినట్లు తెలిపారు. చైర్మన్‌గా డీ దుర్గా భవానీ, వైస్ చైర్మన్ జీ జానీ అలేఖ్య, కార్యదర్శిగా సీహెచ్ జయశ్రీ,, పీజీ ఎగ్జిక్యూటివ్‌గా ఏ రేణుకదేవి, జనరల్ కెప్టెన్‌గా వీఎస్ఎస్ఎస్ ఎల్ భవానీ, కల్చరల్ సెక్రటరీగా వి లతా మల్లేశ్వరి ఎన్నికైనట్లు తెలిపారు. గెలుపొందిన ప్యానల్ సభ్యులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్య ఉషారాణి, యు.లక్ష్మి సుందరి, జీ. రమ్య, ఎస్‌వీ ప్రసాద్, మూర్తి ఇతర అధ్యాపక సిబ్బంది తదితరులు అభినందించారు.

దోమ పుట్టుకను నివారించాలి



తణుకులో దోమల నివారణకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: పట్టణంలోని జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కేంద్రం ఆధ్వర్యంలో దోమ కాటు జనిత వ్యాధులపై సోమవారం తణుకు కప్పల వెంకన్న సెంటర్ ప్రాంతంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కేంద్రం సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిన్న చిన్న నీటి నిల్వలే దోమ పుట్టుకకు ఆవాసాలని అన్నారు. వారానికి రెండు పర్యాయాలు శుభ్రం చేసుకోవాలని సూచించారు. మొక్కల కుండీల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు ఎం.రత్నకుమారి, ఎస్ స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ దేవస్థానంలో సంప్రోక్షణ పూజలు



ముత్యాలమ్మవారి దేవస్థానంలో కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారి దేవస్థానంలో సోమవారం సంప్రోక్షణ పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరాంప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ పండితులు 108 కలశాలకు పూజలు జరిపించారు. ఆ కలశాలతో విద్యార్థినులు, మహిళలు, చిన్నారులు పాత ఆలయం, కొత్త ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి, గ్రామంలో పర్యటించారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, మాకా శేషగిరిరావు దంపతులు, ఆలయ అర్చకులు, సిబ్బంది, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

శ్రీ వాసవిలో ఘనంగా ఫ్రెషర్స్ డే



శ్రీ వాసవిలో ఫ్రెషర్స్ డే వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని శ్రీ వాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో సోమవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం సీనియర్ విద్యార్థులు పర్యవేక్షణలో ఉత్సాహంగా జరిగింది. జూనియర్ విద్యార్థులను ఆహ్వానించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ ఎస్‌వీ రమణారావు, కరస్పాండెంట్ మండవ బ్రహ్మజీ, ప్రిన్సిపాల్ మద్దాల రామకృష్ణ, ఏఓ సీహెచ్ ఉమా సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు మేలు

గ్రామాల్లో ప్రారంభమైన ఆరోగ్య సురక్ష శిబిరాలు



తాడేపల్లిగూడెంరూరల్: అప్పారావుపేట గ్రామంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఎం.విశ్వనాథ్



తణుకు టౌన్: మండపాకలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



తణుకుటౌన్: మండపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్య సేవలు పొందుతున్న దృశ్యం



అత్తిలి:తిరుపతిపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం



ఇరగవరం:కుముదవల్లిలో జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ అన్నారు. మండలంలోని అప్పారావుపేట ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని గ్రామంలోనే అందించడం జరుగుతుందన్నారు. ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు భరోసాగా నిలుస్తాయన్నారు. మాధవరం పీహెచ్‌సీకి చెందిన వైద్యులు టి.సూర్య సుభాషి, టి.గౌతమి, ఏవీ.వెంకటేష్, రూపాదేవిలు 382 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, తగు సలహాలు, సూచనలు అందజేశారు. 96మందికి కంటి పరీక్షలు చేశారు. మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్, ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. గ్రామ సర్పంచ్ ఆరుగొల్లు శ్రీనివాస్, వెంకట్రావుపాలెం ఎలిపే గాంధీ, ఆరోగ్య విస్తరణాధికారి జి.వెంకటేశ్వరరావు, హెచ్‌వీ జి.మణి, సీహెచ్‌వోలు వి.రూత్, ఎ.సత్యవాణి, వి.రామతారకం, వి.సూర్య, రవికుమార్, వి.గాయత్రి, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు

అత్తిలి: అత్తిలి మండలం తిరుపతిపురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 446 మంది వైద్యసేవలు పొందగా వారిలో 35 మంది మెరుగైన వైద్యసేవల కోసం రిఫరల్ చేసినట్లు వైద్యులు తెలిపారు. జనరల్ ఫిజీషియన్, ప్రసూతి, మానసిక, పీడియాట్రిక్, కంటి వైద్య విభాగాల్లో వైద్యులు సేవలందించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గౌరవ అధ్యక్షుడు వడ్డి రాముడు, అధ్యక్షుడు పంపన బుజ్జి, గవర నాగేశ్వరరావు, కొడమంచిలి దొరబాబు, శీలబోయిన రామకృష్ణ, ఇళ్ల పరమేశ్, సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, పంచాయతీ బోర్డు సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

తణుకు టౌన్: గ్రామీణ పేదలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నారని మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు చెప్పారు. సోమవారం తణుకు రూరల్ మండలం మండపాక గ్రామంలోని 2వ సచివాలయం వద్ద జరిగిన జగనన్న ఆరోగ్యసురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామ సచివాలయ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ శిబిరాలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ఈశిబిరంలో టెలి మెడిసిన్ పద్ధతిలో గ్రామానికి చెందిన కిడ్నీ భాదితులు విజయవాడలోని భాస్కర్ ప్రకాష్ అనే కిడ్నీ స్పెషలిస్ట్ వైద్యుల సలహాలు, సలహాలు ఇవ్వడంతో పాటు మందులను కూడా సూచించారు. అనంతరం పది రోజుల తర్వాత ఆసుపత్రికి తీసుకురావాలని బంధువులకు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం వద్ద ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలకు సంబంధించి ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో కే కిరణ్ కుమార్, ఈవోపీఆర్డీ, గ్రామ కార్యదర్శి యుగంధర్ శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందకుమార్, రేలంగి పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బంగారు రవి, వేల్పూరు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ టీఎల్ఎస్ హరిణీ, ఇతర వైద్య సిబ్బంది, నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కె కుముదవల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: మండలంలోని కె కుముదవల్లి గ్రామ సచివాలయ పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని జిల్లా డ్వామా పీడీ ఎస్‌టీవీ రాజేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులు అందించి వారిని పూర్తి ఆరోగ్యవంతులను చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కె కుముదవల్లి గ్రామంలో 620మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రామాయణం జగదీష్, ఎంపీటీసీ పిండి గోవిందారాజులు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు నాయకలు తదితరులు పాల్గొన్నారు.

16న రావిపాడులో దుర్గమ్మ ఆలయ ప్రతిష్ఠ



రావిపాడులో నూతనంగా నిర్మించిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో ఈనెల 16న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ, విగ్రహప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు స్థానిక సొసైటీ అధ్యక్షుడు, పార్టీ నాయకులు దేవ వెంకటరమణ తెలిపారు. ఈ సందర్భంగా రూ. 10 లక్షలతో శిథిలమైన ఆలయాన్ని పునఃనిర్మించారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి, దేవాదాయ శాఖామంత్రి కొట్టు సత్యనారాయణ హాజరవుతారన్నారు. ఆయన చేతులమీదుగా ఆలయ, విగ్రహ పునప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఈనెల 13 నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయన్నారు. 13న గ్రామోత్సవం, అగ్ని ప్రతిష్ఠారాదన, 15న దీక్షారాధన, ధాన్యాధివాసం, జలాధివాసం, 16న ప్రతిష్ఠ, పూర్ణాహుతి, 20న భారీ అన్నసమారాధన కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నట్లు రమణ తెలిపారు.

12న అలంపురంలో ఉచిత మెగా వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురంలో ఈనెల 12న వెంకటరమణ సేవాధారిటీ ఆసుపత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. జనరల్ మెడిసిన్, అంకాలజీ, గైనకాలజీ, చిన్నపిల్లల వ్యాధుల నిపుణులు వచ్చి వైద్యపరీక్షలు చేస్తారన్నారు. అవసరమైన వారికి ఈసీజీ, 2డి ఈకో పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఉపాధికి అండగా వైఎస్సార్ వాహనమిత్ర

- వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ. 10వేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ఆటో, ట్యాక్సీ, ఎండీయూ, మ్యాక్సీడ్రైవర్లు
- ఐదేళ్లలో ఒక్కొక్కరికి రూ. 50వేలు అందించిన వైనం



తణుకులో భారతమాత ఆటో యూనియన్ ఆటో డ్రైవర్లు

తణుకు అర్బన్: ఏ ఒక్కరిపైనా ఆధారపడకుండా తమకు తాముగానే కష్టపడి ఉపాధి పొందుతున్న ఆటో, ఎండీయూ, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ వాహనమిత్ర పథకం ద్వారా కొండంత అండగా నిలిచింది. ముఖ్యంగా ఈ డ్రైవర్ల విభాగాల్లో సొంత వాహనాలు ఉండి వారే డ్రైవింగ్ చేసుకునే డ్రైవర్లకు వైఎస్సార్ వాహనమిత్ర పథకంలో భాగంగా ఏడాదికి రూ.10వేలు అందిస్తూ ఊతమిచ్చింది జగన్ ప్రభుత్వం. ఏ ఉద్యోగానికి అర్హత లేక చాలా మంది యువత ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లుగా స్థిరపడి డ్రైవింగ్ వృత్తిలో ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తున్నారు. అటువంటి వారికి జగనన్న అండగా నిలబడాలనే సదుద్దేశ్యంతో పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం ఏడాదికి రూ.10 వేలు చొప్పున ఇప్పటివరకు 5 ఏళ్లలో రూ.50వేలు డ్రైవర్ల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేస్తుంది జగన్ ప్రభుత్వం. దీంతో ఆటో డ్రైవర్లంతా ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి హర్షం వ్యక్తం చేస్తున్నారు. తణుకు నియోజకవర్గంలోని తణుకు మున్సిపాలిటీ, తణుకు, అత్తిలి, ఇరగవరం మండలాలకు సంబంధించి 1,375 మంది లబ్ధిదారులకుగాను రూ. 1.37 కోట్లు ఈ ఏడాది అందజేశారు.

ఏడాదికోసారి ఇన్సూరెన్స్, బ్రేక్

ప్రతి ఏడాది ఈ విభాగాలకు చెందిన డ్రైవర్లు తమ వాహనాలకు ఇన్సూరెన్స్, బ్రేక్ నిమిత్తం రూ.10వేలు ఖర్చుచేయాల్సి వస్తోంది. ఉదయం నుంచి రాత్రి వరకు తోలిన తోలకం డీజిల్, వాహన మరమ్మతులు వంటి ఖర్చులు తీసేయ్యగా మిగిలిన సొమ్ముతో తన కుటుంబాన్ని పోషించుకోవాల్సి వస్తున్న పరిస్థితుల్లో ఇన్సూరెన్స్, బ్రేక్ వంటి ఖర్చులు భారంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా అందిస్తున్న రూ. 0వేలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని డ్రైవర్లు చెబుతున్నారు.

స్వయం శక్తితో ఉపాధి పొందుతున్న డ్రైవర్లు



వాహనమిత్ర పథకంలో అత్యధిక శాతం లబ్ధి పొందుతూ ఎవరిపైనా ఆధారపడకుండా స్వశక్తితో ఉపాధి పొందుతూ వారి కుటుంబాలను పోషించుకుంటున్న డ్రైవర్లకు వాహన మిత్ర పథకం చాలా ఉపయోగకరంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్రైవర్లకు అండగా నిలబడాలనే ఉద్దేశ్యంతో వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెట్టారు. పథకం ప్రారంభించిన వెంటనే అర్హత ఉన్న ప్రతి ఆటో, ఎండీయూ, ట్యాక్సీ, మ్యాక్సీ డ్రైవర్లకు ఈ పథకం వర్తించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చాను. కొత్తగా వాహనం కొనుగోలు చేసి డ్రైవింగ్ వృత్తిలో ఉంటే వెంటనే వలంటీరు ద్వారా వారి వివరాలను సేకరించి వాహనమిత్ర పథకం వర్తించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

– కారుమూరి వెంకట నాగేశ్వరరావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి

వాహనమిత్ర సద్వినియోగ పడుతోంది



జగనన్న ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న వాహనమిత్ర పథకం చాలా సద్వినియోగ పడుతోంది. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తణుకు వచ్చిన సందర్భంగా ఆయనను మేము కలిసిన సమయంలో వాహనమిత్ర పథకాన్ని ప్రకటించి అమలు చేస్తానని హామీ ఇచ్చి ఐదేళ్లుగా అమలు చేశారు.

– వంగం రాంబాబు, భారతమాత ఆటో యూనియన్ అధ్యక్షుడు, తణుకు

జగనన్నకు రుణపడి ఉంటాం



వ్యాపారం చేసే స్థోమత లేక ఉద్యోగం చేసే అర్హత లేక చాలా మంది యువత ఆటో డ్రైవర్‌గా స్థిరపడి జీవనం సాగిస్తున్నారు. అటువంటి వారి భవిష్యత్తును ఆలోచించి జగనన్న వాహన మిత్ర పథకంగా ద్వారా ఏడాదికి రూ.10వేలు చొప్పున ఐదేళ్లుగా సొమ్మును నేరుగా వారి బ్యాంకు ఖాతాలకే జమచేస్తూ ఆటో డ్రైవర్ల మన్ననలు పొందారు. ఆటో డ్రైవర్లకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మేమంతా రుణపడి ఉంటాము.

– కంచుమర్తి విశ్వేశ్వరరావు, భారత మాత ఆటో యూనియన్ కార్యదర్శి, తణుకు

ఐదేళ్లలో రూ. 50 వేలు అందాయి



వాహన మిత్ర పథకం ద్వారా జగన్ ప్రభుత్వం ప్రతి ఏడాది అందిస్తున్న సొమ్ము మాకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ ఐదేళ్ల కాలంలో నాకు రూ.50వేలు నా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. ఆ డబ్బుతో ఇన్సూరెన్స్, బ్రేక్ తదితర ఖర్చులకు సరిపోతున్నాయి. గతంలో ఈ డబ్బు చెల్లించలేక ఆటో డ్రైవర్లంతా అప్పులపాలై పోయే వాళ్లం.

– వేల్పూరి దానయ్య, ఆటోడ్రైవర్, తణుకు

విజయవాడ తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



విజయవాడలో సమావేశంలో పాల్గొన్న తాడేపల్లిగూడెం ప్రతినిధులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విజయవాడ మునిసిపల్ స్టేడియంలో జరిగిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర స్థాయి సమావేశం విజయవంతమైందని సచివాలయాల కన్వీనర్ కర్రి భాస్కర్‌రావు, కొలుకులూరి ధర్మరాజు, పార్టీ పట్టణ అధ్యక్షులు గుండుబోగుల నాగు, ఉపాధ్యక్షులు తెన్నేటి జగ్జీవన్‌లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో సంక్షేమ పథకాలపై ప్రజలకు మరింతగా వివరించి, లబ్ధి చేకూర్చే ప్రభుత్వానికి ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తామన్నారు. జగన్ వల్లే సంక్షేమ పథకాలతో పేదలు అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి, రాష్ట్ర ప్రగతి, మహిళలకు భద్రత, అవినీతి రహిత ప్రభుత్వం కావాలంటే జగనే రావాలని నినదిస్తామని వారు పేర్కొన్నారు. విజయవాడ సభకు వెళ్లిన వారిలో ఎంపీపీ డి.శేషులత, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోనం విజయనిర్మల తదితరులు ఉన్నారని వివరించారు.

విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



విద్యార్థులతో నిట్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్

తాడేపల్లిగూడెం: విద్యార్థులు చిన్నతనం నుంచే పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ పి.శంకరరెడ్డి పిలుపునిచ్చారు. తణుకుకు చెందిన విద్యార్థులు సోమవారం నిట్‌ను సందర్శించారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే మార్కులొక్కటే సరిపోవని, ప్రతి విద్యార్థి వివిధ అంశాల్లో అంశాల్లో లోతైన విశ్లేషణ, వ్యక్తిగత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిందే అన్నారు. విద్య, వైజ్ఞానిక ప్రదర్శనల ద్వారా తమలో దాగిఉన్న సృజనాత్మక శక్తిని పెంచుకోవాలన్నారు. రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ అసోసియేట్ డీన్ డాక్టర్ వి.సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తకపఠనాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. అవి వారికి వెలకట్టలేని విజ్ఞానాన్ని అందిస్తాయన్నారు . ఈ కార్యక్రమంలో విద్యార్థులు నిట్ ప్రాంగణంలోని విభాగాలను సందర్శించి సంతోషాన్ని వ్యక్తం చేశారు.

అక్టోబరు 15 తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో ఈ నెల 15వ తేది తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు చేస్తామని మండల వ్యవసాయాధికారి డాక్టర్ ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.2200లు రావాలంటే తేమ శాతం 17గా ఉండాలన్నారు.

సంఘాల అభివృద్ధికి సేవకులు పాటు పడాలి

పెంటపాడు: యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్(యుపీఎఫ్) ఆధ్వర్యంలో సంఘాల క్షేమాభివృద్ధికి సేవకులు పాటు పడాలని ఆ సంఘ అధ్యక్షుడు మల్లిపూడి జైబాబు పేర్కొన్నారు. గూడెంలోని సిలువదారి మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సంఘ కార్యదర్శి ఎస్. అబ్రహాం ఆధ్వర్యంలో ఎల్ఎల్ఎం చర్చిలో సోమవారం యునైటెడ్ పాస్టర్స్‌ఫెలోషిప్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో బిషప్ ఐజక్ ముగ్గళ్లతో పాటు ఆయన సంఘ సేవకుల నుద్దేశించి మాట్లాడారు. సేవకలు సంఘాల అభివృద్ధికి ఐక్యతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సేవాజీవితంలో ప్రతిభ కనపరచిన పలువురు సేవకులను సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సీహెచ్ మనష్షే, రాజకుమార్, రత్నరాజు, యెహెజ్కేలు, శామ్యూల్ సునీల్, రాజబాబు, సాల్మన్, జోసఫ్, తదితర సంఘ పాస్టర్లు, యుపీఎఫ్ సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మంచిలిలో ఆత్మీయ సమ్మేళనంలో కలిసిన పూర్వ విద్యార్థులు

అత్తిలి: మండలంలోని మంచిలి జిల్లా పరిషత్ హైస్కూల్ 1995–96 సంవత్సర పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కలయిక సోమవారం స్థానిక పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి విద్యాభ్యాసం చేసిన రోజులు, స్నేహంగా మెలిగిన పరిస్థితులను నెమరువేసుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాల స్థల దాత దుడే సుబ్బారాయుడును స్మరించుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు ప్రసాదరాజు, కె.జ్యామణి, రామకృష్ణ, బాబ్జిలను సత్కరించి వారి ఆశీస్సులు తీసుకున్నారు. ప్రస్తుత మంచిలి గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు బండి అయ్యప్ప, ఎంపీటీసీ దారం శిరీష, భర్త దారం వీరన్నలు కూడా అదే బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు కావడం విశేషంగా గుర్తు చేసుకున్నారు.

డ్రెయిన్‌లోకి దూకేందుకు వ్యక్తి యత్నం.. కాపాడిన సీఐ

సాక్షి, భీమవరం: ఆత్మహత్యకు పాల్పడేందుకు డ్రెయిన్‌లోకి దూకేందుకు ప్రయత్నించిన ఓ వ్యక్తిని ట్రాఫిక్ సీఐ జి.దాసు కాపాడిన ఉదంతమిది. పట్టణంలోని ప్రకాశంచౌక్ సెంటర్ వద్ద సోమవారం ఓ వ్యక్తి యనమదుర్రు డ్రెయిన్‌లోనికి దూకేందుకు ప్రయత్నించగా అదే సమయంలో అటుగా వెళుతున్న సీఐ దాసు అతని ప్రవర్తనపై అనుమానంతో తన మోటారుసైకిల్‌ను పక్కనపెట్టి అతడ్ని అడ్డుకుని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వ్యక్తి ఈ ఘటనకు సంబంధించి ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.